# ఆనాటిదీ, ఈనాటిదీ అలంకరణ కథ



*శ్రుత్వాయాంతం బహిః కాంతం*

*అసమాప్త విభూషయా*

*ఫాలే అంజనం నేత్రేలాక్షా*

*కపోలే తిలకః కృతః*

*భావం:* ప్రియుడు ఇంటి గడప దాకా వచ్చాడని విన్న ఆమె అప్పటికి అలంకారం పూర్తికాక (వెంటనే) నుదుటపై కాటుకనూ, కళ్ళకు లత్తుకనూ, చెంపపై తిలకాన్నీ పెట్టుకున్నది.

స్త్రీలు సింగారించుకునేసరికి సినిమా ఇంటర్వెల్ దాకా అయిపోతుందని భర్తలూ, బాయ్ ఫ్రెండ్సూ కూడా వెక్కిరిస్తూ ఉంటారు. కానీ స్త్రీల సింగారం మగవారికోసమే కదా? అందంతో ఆనందింప చెయ్యాలనైనా కావచ్చు లేదా ఇలాంటి ఏబ్రాసి ఆడది దొరికిందా నీకు అన్న వెక్కిరింపులనుంచి తప్పించడానికైనా కావచ్చు.

వినయవతీ, విద్యానాధుడూ ప్రేమించు కున్నారు. ఇరువురూ ఉద్యానవనాలకీ, నదీ తీరాలకీ కలిసి వెడుతూ హాయిగా కాలక్షేపం చేస్తున్నారు. ఒకరోజు విద్యానాధుడు దోరసముద్రం నుంచి నాటకబృందం వచ్చిందనీ, సాయంత్రం దేవాలయంలో నాటక మాడతారనీ, తాను వచ్చి తీసికెడతాననీ అన్నాడు. ఆ నాటక బృందానికి మంచి పేరుందనీ, ఊరందరూ రావచ్చనీ అన్నాడు.

మర్నాడు మధ్యాహ్నం వినయవతి అలంకార గృహంలో ఆలోచిస్తూ కూచుంది. ఇన్నాళ్ళూ తాము జనమెక్కువ లేని ప్రదేశాలలోనే విహరిస్తున్నారు. నాటకమంటే విద్యానాధుని స్నేహితులు వస్తారు. అతని తల్లిదండ్రులూ, బంధువులూ కూడా రావచ్చును. తాను అందంగా, ఆకర్షణీయంగా కనబడాలి. ఎర్రరంగు పట్టుచీర కట్టుకుని కెంపుల నగలు పెట్టుకోవాలా, తెల్ల జరీ చీర కట్టుకుని ముత్యాలహారాలు వేసుకోవాలా, నీలి గద్వాలచీర కట్టుకుని ఇంద్ర నీలమణులు అలంకరించుకోవాలా, అని ఆమె ఆలోచిస్తూ కూచుంది.

ఆమె ఆలోచన తెగకుండానే సాయంత్రమైంది. విద్యానాధుడు ఇంటికి వస్తున్నాడని చెలికత్తెలు వచ్చి చెప్పారు. వినయవతిలో కంగారు మొదలైంది.

అయ్యో తొందరగా ఆలంకరించుకోవాలి అనుకుంటూ ఆమె అద్దంవైపు కూడా చూడకుండా అలంకార సామగ్రి దగ్గరకు తీసుకుంది. నుదుట కాటుక పెట్టుకుని, చెంపపై తిలకం పెట్టుకుని కళ్ళకు లత్తుక (నేటి రోజ్ పౌడర్ వంటిది) పెట్టుకుంది.

మాసిన చీరతో, అస్తవ్యస్తమైన అలంకారంతో ఉన్న వినయవతినీ, ఆమె కంగారునీ చూసిన విద్యానాధునిలో ప్రేమా, జాలీ పొంగాయి. 'నాటకానికి రేపు వెడదాంలే " అంటూ ఆమెను దగ్గరకు తీసుకున్నాడు.

ఇటువంటిది పూర్తిగా కాకపోయినా సుమారుగా ఇలాంటి కథ ఇంటర్నెట్‌లో సర్క్యులేట్ అవుతున్నది. ఓ ప్రియుడు ఏడింటికి వచ్చి బయటకు తీసికెడతానన్నాడు. అమ్మాయి ఏడింటికి రెడీఅయి కూచుంది. తొమ్మిదింటి దాకా అబ్బాయి రాలేదు. అమ్మాయికి విసుగూ, ఆకలీ కలిగాయి. మంచి డ్రెస్ మార్చుకుని, నైటీ వేసుకుని, మేకప్ కడిగేసుకుని, ఫ్రిజ్‌లోనుంచి పిజ్జా తీసుకుని తింటూ టి.వి. ముందు కూచుంది. అప్పుడు వచ్చిన ప్రియుడు 'రెండుగంటలు ఆలస్యంగా వచ్చాను. ఇంకా తెమలలేదా" అన్నాడు.

ఇప్పుడు చెప్పండి. సింగారించుకుంటూ ఆలస్యం చెయ్యడం స్త్రీల లక్షణమా, ఆడవాళ్ళకి అది ఆనందదాయకమా?

******